# ఏది ప్రేమ, ఏది కాదు?

గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

"ప్రేమ అంటే ఏమిటి?"—పరిష్కరింపబడని సమస్యాసహస్రంలో ఇది ఒకటి. ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరాన్ని భూతకాలం ఇవ్వలేక పోయింది; భవిష్యత్తు ఇస్తుందనే ఆశ లేదు.

"అది ప్రేమకాదు, ఇది ప్రేమకాదు అని ఖండించటం కంటె రచయిత ఏది ప్రేమో నిర్వచిస్తే బాగుండేది" అని జూలై 15 వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో మోపర్తి వారు అడిగారు రావుగారిని—కాదు, లోకాన్ని. నిజానికి ఇది బహు చక్కని ప్రశ్నే. అయితే, ఈ ప్రశ్నకు జవాబు లేదు. అందుకనే ఇది బహు మంచి ప్రశ్న అన్నది. నేనీవ్యాసం వ్రాయటంలో విమర్శ ప్రతి విమర్శలను జరుపుతూ ఉన్న రచయితల వాదవివాదాలలో పాల్గొనటంలేను. లోకాన్ని ఎదుర్కొన్న పరిష్కారం కాని ప్రశ్నను గూర్చినది ఈ వ్యాసం. "ప్రేమ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకూ వారి విమర్శలకూ ఏపాటిసంబంధం ఉన్నదో, ఈ వ్యాసానికీ ఆ విమర్శ ప్రతి విమర్శలకూ అంతే సంబంధం ఉన్నది.

నిజానికి,రావుగా రన్న మాట సత్యమే. "ఈ రోజుల్లో కామానికి ప్రేమఅన్న ఘరానా పదం పరిపాటి అయిపోయింది." "ఈ రోజుల్లోనే కాదు, యే రోజుల్లోనైనా అంతే!" అంటారు మోపర్తివారు. జనసామాన్యం ఉపయోగించిన వాడుకవల్ల ప్రేమ అనే పదానికి చాలా అర్థాలు ఆరోపింపబడినై. "ప్రేమ" అనే పదానికి గల యథార్థమైన అర్థం ఇదీ అని నిర్ణయించలేము. అయితే, 'ప్రేమ' 'అంటే 'ఇదీ' అని నొక్కి చెప్పలేకపోయినప్పటికీ, ప్రేమఅనే "వస్తువు"ను ప్రేమకాని వాటినుంచి విడదీయటం వీలు పడుతుంది.

నిఘంటు కర్తలు ప్రేమ అనే పదానికి అనుచితమైన సామాన్యార్థాలను సూచిస్తారు.'ప్రేమ'తో పాటు సరిసమానంగా చలామణీ అవుతున్న పదాలు కామం, మోహం, స్నేహం, హర్షం, అనురక్తి, అనురాగం మొదలైనవి.

ప్రేమ, కామం అనే పదాలకు గల సంబంధమూ, భేదమూ చూడటం ప్రస్తుతం. కామం, మోహం అనే పదాలతో ఒక విధమైన నైచ్యం చేర్పబడి ఉన్నది. కామం అంటే ఇచ్ఛ, కోరిక. కామం అంటే సాధారణంగా జాత్యవాంఛ. పురుషుడు ఒక అందగత్తెను తిలకిస్తాడు. ఆమె యౌవనాంగాల సౌందర్యం అతనిలో తాత్కాలికంగా ఒక నీచప్రవృత్తిని రేపుతుంది. ఆ వాంఛ అవకాశం ఉంటే నానాటికీ వృద్ధిచెంది తృష్ణగా మారుతుంది; లేకపోతే క్షణికమై ఆ పడుచు కనుచూపునుంచి దాటిపోగానే అభావం కూడా పోతుంది. కాముకుడు ఎటువంటి నీచానికైనా ఒడికడతాడు. ఇటువంటి నీచభావాలను యిముడ్చుకున్న కామానికి ప్రేమ అనే అర్థాన్ని సూచించిన నిఘంటు కర్తకు ఏ శిక్ష విధించాలో బోధపడదు. మోహం కూడా దీనికి దగ్గరి బంధువే. ఇది నాగరక వస్త్రాల్లో అవతరించిన కామం. ఇది స్త్రీ పురుష వ్యక్తుల మధ్య వెలసినట్లయితే కామం అనే నామం తాలుస్తుంది. కాని, ఇది స్త్రీ పురుషుల మధ్య ఉండే సంబంధాన్ని మాత్రమే సూచించదు. కుమారుడి మీద తండ్రికిఉండే దట్టమైన స్నేహం మోహమే అనిపించుకుంటుంది. ధృతరాష్ట్రుడికి దుర్యోధనుని మీద గల మోహమే ద్వితీయ ద్యూతానికి కారణం. అయితే కామమూ, మోహమూ రెండూ అజ్ఞానజనితాలే.

ప్రేమ మహోత్కృష్టమైనది. ప్రేమ పవిత్రమైనది. ప్రేమ నోటిమాటల కందనిది.

ఈ రోజుల్లో ఎలాగో ఆరోజుల్లో కూడా "కామానికి ప్రేమ అన్న ఘరానా పదం పరిపాటి అయిపోయింది." మోపర్తి వారు మనలను ఒక్కసారి మన కావ్యాలవైపు, ప్రబంధాలవైపు దృష్టి మరల్చమంటున్నారు. మనం మరల్చిచూస్తే, ఈ రోజుల్లో మల్లే నే

ఆ రోజుల్లోనూ పామరులూ, పండితులూ, కవులూ కూడా పప్పులో కాలువేశారని కనిపిస్తుంది.

తరచి చూస్తే, ప్రేమకూ కామానికీ మధ్య సరిహద్దు దివికీ భువికీ మధ్య ఉన్నంత సూక్ష్మమైనది. ప్రేమ అనేది నిన్న పుట్టిందికాని, ఇవాళ పుడుతున్నదికాని, రేపు పుట్టబోయేదికాని కాదు. అది ఏ విధంగా పుట్టలేదో ఆ విధంగానే గిట్టలేదు సర్వదా ఈ బ్రహ్మాండ ప్రపంచంలో ఒకటిగా, తనే ఈ బ్రహ్మాండ ప్రపంచంగా ఉంటూ ఉండేది అది. అది స్త్రీ పురుషుల మధ్య వర్ధిల్లేది మాత్రమే కాదు; అంతటా అందరిలోనూ ఒక భాగంగా, తనే వారుగా ఉంటూ ఉండేది అది. మనిషితో పుట్టేదికాని, మనిషితో గిట్టేదికాని కాదది. సూర్యచంద్రాగ్నులు వెలుగుతున్నంతకాలం, కాలచక్రం తిరుగుతున్నంతకాలం అది ఉంటూనే ఉంటుంది. ఆ తరువాతకూడా ఉంటుందది. బాలకృష్ణయ్య మర్రి ఆకుమీద విశాలాంభోధిలో పవళిస్తాడు, బొటన వ్రేలును చీకుతుంటూ-అప్పుడూ ఉంటుంది ఆ ప్రేమ అనేది.

కామానికి ఒక ఆది ఏ విధంగా ఉన్నదో, ఒక అంతమూ ఆ విధంగానే ఉన్నది. పురుషుడు స్త్రీని ఇవాళ కామిస్తాడు; రేపు మర్చిపోతాడు; లేదా, ఇరువురి తనువులూ, వయసులూ రాలిపోతై. తరువాత కామానికి రూపనామ క్రియలు ఉండవు.

మరొకటి. కామం అంటే ఒక ఇచ్ఛ, ఒక కోరిక. కాముకుడు కామంద్వారా ఒక వస్తువు అనుభవాన్ని వాంఛిస్తాడు. ఆ కోరికను కొనసాగించుకోటానికి కాయశక్తులా తంటాలు పడతాడు. ప్రేమవల్ల మనిషికి కలిగే లాభం చిల్లిగవ్వంతైనా లేదు- అయితే ప్రేమరసాన్ని గ్రోలిన వాడికి వివేకానందం లభిస్తుంది. కామంవల్ల జరుగవలసిన కార్యమూ, కాంక్షించే కోరికా ఉన్నది కాబట్టి అది తృష్ణ అవుతుంది. ఈ కోరికే అపదానికి నీచత్వాన్ని చేకూరుస్తుంది.

ప్రేమ వస్తుతా కామం కాదు సరికదా, ప్రేమలో కామం ఒక భాగం కూడా కాదు. అందువల్లనే "కామసహితమైన ప్రేమ", "కామరహితమైన ప్రేమ" అనేవి అర్థరహితమైన పదాలు. పెండ్లి చేసుకోవాలనే తాపత్రయానికి ప్రాతిపదిక సాధారణంగా ప్రేమ కాదు; కామం. ఒక వ్యక్తిని భౌతికసౌఖ్యార్థి కామిస్తాడు. సౌఖ్యాన్ని పొంది, అంతటితో తనివితీరక ఆ సౌఖ్యాన్ని నిలబెట్టుకోటానికి ఆ వ్యక్తిని తనతోపాటు వివాహం అనే సాంఘిక బంధంలోకి దింపుతాడు.

"కాముకుడు తన సుఖానికై ప్రియురాలిని బలి గావిస్తాడు." అవును, ఇది నిజమే. కాముకుడికి అర్థించే వస్తువు ఒకటి ఉంది.

"ప్రేమికుడు ప్రియురాలి సుఖానికై తాను బలి అయిపోతాడు." కాని, ప్రేమకు లింగభేదాలు లేవు. అందుకే స్త్రీ పురుషుల మధ్యే వెలయనక్కర్లేదు ప్రేమ. స్వార్థప్రధానమైనది కామమనీ, త్యాగప్రధానమైనది ప్రేమ అనీ రచయిత స్వభావాన్ని వెల్లడిచేశారు. ఈ నిర్వచనం బాగానే ఉన్నది. కాని, ప్రస్తుతచర్చలో త్యాగంకన్నా వాంఛ ప్రధానం. కాముకుడిలో ప్రబలిన పెద్దవాంఛ పర్యవసానమే అతని కామకేళి. ఆ ఇచ్ఛలో కాముకుడికి స్వర్గం కనిపిస్తుంది. అట్లాగే సాధారణంగా కాముకికీ అది ఆనందసంధాయకంగానే ఉంటుంది. అందువల్ల సామాన్యంగా కాముకుడు కాముకిని తన సుఖానికై బలిచేయవలసిన అగత్యం లేదు. కాముకీకాముకులు ఇద్దరూ కామవాంఛలో ఏవిధంగా భాగస్వాములో, దానిలోనుంచి వారికి లభించే సౌఖ్యంలోనూ భాగస్వాములే. ప్రేమకు వాంఛించవలసిన అర్థం ఉండదు. ప్రేమధామం అంటే ఒక విధమైన శాశ్వతానంద సమాధి. వాంఛామూలకంగా క్షణిక భౌతికసౌఖ్యాన్ని కాంక్షించే మానవుడిలోని నీచప్రవృత్తి కామం. వాంఛారహితమై శాశ్వతానంద సమాధికి మూర్ధభూమి అయినది సర్వాంతర్యామి, ఆద్యంతరహిత, అవినాశి అయిన ప్రేమ.

అందం ప్రేమాంకురానికి కాదు ప్రధాన కారణం; కామాంకురానికి. అందానికీ, ప్రేమకూ సంబంధం లేనేలేదు. "ప్రేమ గుడ్డిది" అనే నానుడి ప్రసిద్ధం. అందుకే ప్రేమకూ, అందానికీ ఎటువంటి సంబంధమూ లేదు. కాని కామ

నికీ, అందానికీ సంబంధం ఉండవచ్చు. కాముకుడు తను ఎన్నుకునే భాగస్వామిని అందగత్తె ఔనా కాదా అనే మీమాంస పొందుతాడు. అందానికిగల ప్రాముఖ్యాన్ని కాముకుడు సాధారణంగా విస్మరించలేడు. ప్రేమకు ప్రాతిపదిక అందంకాకపోతే మరియేదో చెప్పలేదు రచయితఅన్నారు. ప్రేమకు ప్రేమే ప్రాతిపదిక. ప్రేమ ప్రేమలోనే పుట్టింది.

మోపర్తివారి వ్యాసంలో "ప్రేమ" అనే చోటల్లా "కామం"అనే మాటను వ్రాసి చదువుకుంటే వ్యాసం చక్కగా ఉంటుంది.

ప్రేమకూ, కామానికీ ఉండే ముఖ్యమైన భేదాలు ఇవి: ప్రేమకు వాంఛ లేదు, కామం అంటేనే ఇచ్ఛ. వాంఛారహితమైన ప్రేమ ఉత్కృష్టాకృతిని దాల్చింది, వాంఛాసహితమైన కామం నీచాకృతిని పొందింది— కామం సర్వథా నీచమైనదే కాదు, కామం రెండువిధాలు: ధర్మప్రసిద్ధమూ, ధర్మవిరుద్ధమూ అని. ప్రేమ అంతటా అందరిమధ్యా స్వతస్సిద్ధంగా ప్రబలి ఉన్నది. అది కొన్నిచోట్లమాత్రం స్ఫుటంగా గోచరిస్తుంటుంది. కామం లింగభేదానికి కట్టుబడింది. ఇది స్త్రీ పురుషుల మధ్యే నెలకొంటుంది. ప్రేమకు ఆద్యంతాలు లేవు; కామానికి ఉన్నాయి. ప్రేమికుడికి శాశ్వతమైన సికానందాన్ని ప్రసాదిస్తుంది; కామం కాముకుడికి క్షణిక భౌతిక సౌఖ్యాన్ని చేకూరుస్తుది.

ప్రేమకు ప్రేమే ప్రాతిపదిక; కామానికి అందం ప్రాతిపదికకావచ్చు. ప్రేమ మానవ మానసవిజ్ఞానాలకు అతీతమై, మానవుడి కొలత బద్దల పరిమాణాలను మించి, తరచి చూచినా అగమ్యగోచరంగా పరిణమించే మహత్తరశక్తి. కామం కాముకుల అంతరంగాల అజ్ఞానాలకు చిక్కుతూ, కాముకుడి బూర్జువా మైలురాళ్లఎత్తుల గిరిశిఖరాలనంటుతూ,తరచి చూస్తే ఒకమారు ఆనందాంబుధిలాగా, మరొకమారు ఖేదసముద్రంలాగా కనిపిస్తూ చివరికి శూన్యంలోకి, అజ్ఞానాంధకారంలోకి నిర్దాక్షిణ్యంగా తోసే టక్కరి మహామ్మారి శక్తి.

ప్రేమ ఒక అఖండశక్తి. విశ్వసర్వస్వం ప్రేమ సూత్రంమీద అల్లబడింది. గుణదోషద్వంద్వరాహిత్యమే దీనికిచిహ్నం. దీనికి వాంఛలు లేవు. అవ్యాజానందమే ప్రేమకు కొండగుర్తు.

బోసినవ్వులు వెళ్ళబోసే పాపాయిలో అనంతమైన ప్రేమ ఉన్నది. పెరిగే చిన్న పాదపంలో అమేయమైన ప్రేమ ఉన్నది. విశాలమైన ప్రకృతిలో తెలుసుకోటానికి అలవికాని ప్రేమ ఉన్నది. అనంతాకాశాంతరిక్షాలలోనూ, విశాల వినీల సాగరాలలోనూ ప్రేమ ప్రతిబింబిస్తూంటుంది.

"అది ప్రేమకాదు, ఇది ప్రేమ కాదు అని ఖండించటంకంటె రచయిత యేదిప్రేమో నిర్వచిస్తే బాగుండేది." అదే నాకూ పథ్యంగా తోస్తున్నది. కాని, ఆ నిర్వచనం ఏదీ?

'ప్రేమ' అంటే ఏమిటి? ...... ఇంతకూ ప్రశ్నకు సమాధానం ఏదీ? అది సరేగాని- చెట్టు ముందు పుట్టిందా, విత్తు ముందుపుట్టిందా? అనాదిగా పరిష్కారాన్ని నిరీక్షిస్తున్న ఈ సమస్య తెమిలితేనేగాని పెండటేది తేలదేమో? అయినా, మళ్లీ మన బాలకిష్టయ్య వస్తాడు, బోసినోటి చిరునవ్వుల సహస్రాన్ని ఒలకబోసుకుంటూ, తన వటపత్రశయ్యమీద కేరింతాలు కొడుతూ పడుకోడానికి. అప్పుడైనా ఆ బోసినోటి మందహాసాల్లో ఇమిడిన ప్రేమతత్వరహస్యాన్ని మన మనోకర్ణాల్లో ఊదిపోతాడేమో చూద్దాం!

దారువునందు బుట్టిన అగ్ని క్రమముగ దారువునే దహించు భంగి శరీర లావణ్యమున నుద్భవించిన అనురాగమను నిర్ధూమ ధామానలనము ధర్మ ధారణచే ఇంద్రియములను జయించి మమతా గంధరహితమగు శాంతి రతి యందోలలాడును.—(ముట్నూరి కృష్ణరావు)